సాక్షి
మెదక్

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



రోడ్లపైనే వడ్లు
పంటను ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. వివరాలు IIలో ▸



ప్రధానోపాధ్యాయుడి ఔదార్యం
అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధతో వేసవి శిబిరం నిర్వహిస్తున్నాడు. వివరాలు IIలో ▸



టార్పాలిన్లకు భలే డిమాండ్
ధాన్యం ఆరబెట్టుకోవాలన్నా.. వర్షం నుంచి కాపాడుకోవాలన్నా అన్నదాతను ఆదుకునేవి టార్పాలిన్లు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

ఫైరింగ్ రేంజ్ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని మల్లన్నగుట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న పోలీస్ ఫైరింగ్ శిక్షణ కేంద్రం పనులను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫైరింగ్ ప్రాక్టీస్ కోసం వేరే జిల్లాకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. జిల్లాలో ఫైరింగ్ రేంజ్ కల సాకారం కాబోతుందన్నారు. మే 2న ఐజీ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, ఆర్‌ఐ శైలేందర్, ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ ఉన్నారు.

కల్లుదుకాణాలపై ఎక్సైజ్ దాడులు ఆపాలి
మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లోని కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులతో దాడులు చేయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని, వెంటనే దాడులు ఆపాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన కామారెడ్డి జిల్లా నందిపేట్ వెళ్తూ నార్సింగి మండల కేంద్రంలోని రేణుకామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఆయనను సత్కరించి, తమ సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గౌడ్ కులస్తులకు సరైన గౌరవం దక్కిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అణచివేసేందుకు చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, గౌడ సంఘం నాయకులు సిద్దాగౌడ్, యాదాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, రాజుగౌడ్ ఉన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు అన్యాయం
సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి


శివ్వంపేట పీఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలపై ఉద్యమిస్తే పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీలను ముందస్తు అరెస్టు చేయడంపై తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు పెంచిన వేతనాలతో పాటు 11 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా హక్కులను సాధించుకునే వారిని ప్రభుత్వం అడ్డుకోవాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, విజయలక్ష్మి, ఫాహీం, మ్యూనిస, జ్యోతి ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు
కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి, తునికిలోగల ఎంజేపీ (మహాత్మ జ్యోతి బాపూలే) బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఎంజేపీ బీసీ గురుకుల కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ఎలాంటి పోటీ పరీక్ష లేకుండా విద్యార్థులకు పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వెల్దుర్తి రహదారిపై ధాన్యం తూకం ప్రారంభించాలని ధర్నా చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన అన్నదాతలు

కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేయాలని ధర్నా

వెల్దుర్తి(తూప్రాన్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించాలని రైతులు ధర్నా చేశారు. వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే దారిలో ఉన్న ఉప్పు లింగాపూర్ వద్ద రైతులు మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతుల ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈ ధర్నాకు సీపీఎం నాయకుడు గౌరి సంఘీభావం తెలిపారు. కొనుగోలు ప్రక్రియ వెంటనే ప్రారంభించనున్నట్లు సొసైటీ ప్రతినిధులు, పోలీసులు హామీ నివ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడి కాపులు కాస్తున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి కేంద్రానికి కేటాయించిన హమాలీలను సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి బండపోసన్‌పల్లికి తీసుకెళ్లారని ఆరోపించారు. ధాన్యం తూకం వేయకపోవడంతో రెండుసార్లు వర్షానికి తడిసిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో తూకాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాకొద్దు.. ఇందిరమ్మ ఇళ్లు!

నిర్మాణాలకు ముందుకు రాని లబ్ధిదారులు
- 400 నుంచి 600 చ.అ. విస్తీర్ణంలో నిర్మిస్తేనే బిల్లులు
- పైలట్ ప్రాజెక్టు కింద 1,555 ఇళ్లు మంజూరు
- పునాది పూర్తయినవి 70.. బిల్లులు చెల్లించినవి 54
- నిబంధనలు పాటించని 16 మందికి బిల్లుల నిలిపివేత

దశాబ్దాల తరబడి సొంతింటి కోసం ఎదురు చూసిన పేదలకు ప్రభుత్వ నిబంధనలు ఆటంకంగా మారాయి. దీంతో వారి కల నెరవేరే పరిస్థితి కానరావడం లేదు. సర్కార్ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణం లోపల మాత్రమే నిర్మించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ స్థలంలో నిర్మించిన వారికి బిల్లు రావడం లేదు. జీవితంలో ఇల్లు నిర్మించేది ఒక్కటేసారని, ప్రభుత్వం సూచించిన ఇంత చిన్న ఇల్లు మాకొద్దు అంటూ పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఫలితంగా ఇందిరమ్మ ఇళ్ల పనులు ముందుకు సాగడం లేదు.



మెదక్‌జోన్: మెదక్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద 21 మండలాల పరిధిలో మండలానికి ఓ గ్రామం చొప్పున 21 గ్రామాల్లో 1,555 మంది లబ్ధిదారులను మూడు నెలల కింద ఎంపిక చేశారు. కానీ ఇప్పటి వరకు కేవలం 320 మంది మాత్రమే పనులు ప్రారంభించగా అందులో 70 మంది పునాది వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. వారిలో 54 మంది లబ్ధిదారులు మాత్రం నిబంధనల ప్రకారం నిర్మించగా వారికి అధికారులు రూ.లక్ష చొప్పున బిల్లులు మంజూరు చేశారు. మిగతా 16 మంది 600 చదరపు అడుగులకన్నా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించారని వారికి బిల్లులు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపల నిర్మిస్తేనే బీపీఎల్ కిందకు వస్తారని, లేనిచో ధనికుల జాబితాలో చేరుతారని అందుకే ఆ 16 మంది లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వలేదని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. కాగా అధికారులు చెప్పిన విధంగా ఇల్లు నిర్మిస్తే ఒకే బెడ్రూం, చిన్న పాటి హాల్ ఉంటుందని, ఇద్దరు కొడుకులు ఉన్న కుటుంబానికి ఎలా సరిపోతుందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న ఆర్థిక సహాయం రూ. 5 లక్షలు ఇస్తే రెండు బెడ్రూంలు వచ్చే విధంగా నిర్మించుకుంటామని లబ్ధిదారులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇంత చిన్న ఇల్లు నిర్మించుకుంటే మా కుటుంబానికి సరిపోదని, ఈ విషయంపై అధికారులు పునరాలోచించాలని వారు వాపోతున్నారు.

ఎంతమంది ముందుకొస్తారో?

బీఆర్‌ఎస్ హయాంలో అతికొద్ది మందికి మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇచ్చారు. కానీ ప్రజల అవసరం మేరకు ఈ నిర్మాణాలు కొనసాగలేదు. కానీ ఇప్పుడైనా ఇళ్లు లేని నిరుపేదలకు వస్తాయనుకుంటే నిబంధనల పేరుతో అడ్డంకులు ఎదురవుతున్నాయి. నియోజక వర్గానికి 3,500 ఇళ్ల చొప్పున జిల్లాలో రెండు నియోజకవర్గాలకు గానూ 7 వేల ఇళ్లు రావాల్సి ఉంది. రెండో విడత ఇళ్ల సర్వే జిల్లాలో జోరుగా కొనసాగుతున్నది. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే నిర్మించాల్సి ఉండటంతో ఎంత మంది ముందుకు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ముందు చెప్పలేదు



ముగ్గు పోసేముందు మాకు ఎలాంటి నిబంధనలు చెప్పలేదు. ప్రస్తుతం 9 పిల్లర్లతో పునాది లెవల్ వరకు పూర్తి చేశాం. 600 చదరపు అడుగుల కన్నా ఎక్కువగా ఉందని, అధికారులు బిల్లు ఇవ్వడం కుదరదు అంటున్నారు. మా కుటుంబం పెద్దది కావడంతో పెద్దగా నిర్మించుకుంటున్నాం. అధికారులు బిల్లు ఇచ్చి ఆదుకోవాలి. – మర్కంటి సుశీల, ధర్మారం గ్రామం, వెల్దుర్తి మండలం

నిబంధనల ప్రకారం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిలోపవర్టీలైన్(బీపీఎల్) కింద 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే నిర్మించాలి. ఏ మాత్రం ఎక్కువ నిర్మించినా బిల్లులు ఇవ్వడం కుదరదు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయి అధికారుల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించాం. నిబంధనల ప్రకారం నిర్మించిన 54 మందికి ఇప్పటికే బిల్లులు చెల్లించాం.
– మాణిక్యం, హౌసింగ్ పీడీ, మెదక్

కార్యకర్తలను కాపాడుకుంటా

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్‌జోన్ : పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుపాయలు, చర్చి అభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయి కుమార్ మాట్లాడుతూ పార్టీకోసం పని చేసిన వారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నేతలు రాజిరెడ్డి, సుహాసిని రెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సుప్రభాత రావు, రామచందర్ గౌడ్, చంద్ర పాల్, హఫీజ్ పాల్గొన్నారు. అంతకు ముందు కశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

అదనపు కలెక్టర్‌కు ఈజీఎస్ ఉద్యోగుల వినతి


అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పే స్కేల్ అమలు చేయాలని ఈజీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఈజీఎస్ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ రాజ్ కుమార్, ఏపీఓలు మహిపాల్ రెడ్డి, శ్యామ్ కుమార్, శంకర్, పాల్, ఈసీలు భగవాన్ రెడ్డి వేణు, రాజేశ్వర్, సీఓల సంఘం రాష్ట్ర నాయకులు రాము, జేఏసీ ప్రతినిధులు శశిరేఖ, స్వప్న, బాలరాజ్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు భద్రత, మే4న జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష, ఉల్లాస్ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. నేషనల్ హైవేలపై బ్లాక్ స్పాట్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. నీట్ పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాల న్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు.తూప్రాన్, మనోహరాబాద్, నర్సాపూర్, శివంపేట మండలాల్లోని చెరువుల సర్వేను వేగవంతం చేయా లని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాగా ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లాటరీలో మెదక్ బార్ అండ్ రెస్టారెంట్‌ను హైదరాబాద్‌కు చెందిన శోభ దక్కించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సమావేశాల్లో ఆర్‌అండ్‌బి సర్దార్ సింగ్, డీఎస్పీ ప్రసన్న కుమార్, పోలీసులు, ఆర్డీవో రమాదేవి, యూజీసీ-నీట్ సిటీ కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కే హంస్సేన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


ధాన్యం తేమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలం కమలాపూర్, శివాయిపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈఓలు అఖిల్, వినీత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, రాములు, శ్రీను, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, జనార్దన్, పెరుమాండ్లగౌడ్, సత్యనారాయణరావు, భానుగౌడ్, గోవింద్‌రావు, వెంకటరావు, ఏపీఎం గోపాల్ తదితరులున్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు


శాలిపేట రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రమాదేవి

మెదక్ ఆర్డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని మెదక్ ఆర్డీఓ రమాదేవి హెచ్చరించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట, శాలిపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. అలాగే శాలిపేటలోని రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమ శాతం పరిశీలించి ధాన్యాన్ని వెనువెంటనే కాంటాలు వేయాలన్నారు. కాంటా అయిన తరువాత రైస్‌మిల్లుకు తరలించాలని సూచించారు. రైస్‌మిల్లర్లు లోడింగ్, అన్లోడింగ్ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆమె వెంట చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ ఉన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని రైస్‌మిల్లులను ఆర్‌ఐ మేఘనగౌడ్ తనిఖీ చేశారు.

ట్రాక్టర్లతో ధాన్యం తరలిస్తే అద్దె చెల్లిస్తాం

చేగుంట(తూప్రాన్): లారీల కొరత ఉన్నందున ట్రాక్టర్లలో ధాన్యం తరలిస్తే అద్దె చెల్లిస్తామని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి చిన్న శివునూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రికార్డులు, నాణ్యత పరీక్షల వివరాలు, చెల్లింపుల వివరాలపై ఆరా తీశారు. ధాన్యం సేకరణను పారదర్శకంగా నిర్వహించాలని ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, కేంద్రాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు తరుగు కష్టాలు

- పక్షం రోజుల్లోనే తరుగు దోపిడీ మొత్తం రూ.2.36 కోట్లు
- క్వింటాల్‌కు 4 నుంచి 5 కిలోలు కోత
- సర్కారు కొనుగోలు కేంద్రాల్లోనూ తాలు దందా


కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తరుగు పేరుతో అన్నదాతల నిలువు దోపిడీ షురువైంది. తరుగు పేరుతో క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు తూకంలో కోత పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతులపై దోపిడీ పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన పక్షం రోజుల్లోనే ఈ తరుగుపేరుతో సాగిన దోపిడీ ఏకంగా రూ.2.36 కోట్లు ఉందంటే.. ఈ సీజను ముగిసేసరికి దోపిడీ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఇదీ దోపిడీ లెక్క

మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఊపందుకుని రెండు వారాలు గడుస్తోంది. ఈ నెల 28 వరకు జిల్లా వ్యాప్తంగా 5,873 మంది రైతుల వద్ద 25,472 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ఈ తరుగు పేరుతో 40 కిలోల బస్తాకు..గన్నీ సంచి బరువు పోగా రెండు నుంచి మూడు కిలోల ధాన్యం అధికంగా తూకం వేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాల్‌కు కనీసం ఐదు కిలోలు రైతుల ధాన్యం తూకంలో కోత పెడుతున్నారు. తక్కువలో తక్కువ క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున లెక్కించినా టన్నుకు 40 కిలోల వరకు రైతులు నష్టపోతున్నారు. ఈ లెక్కన ఈ రెండు వారాల్లో కొనుగోలు చేసిన 25,472 మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఏకంగా 1,081 టన్నుల ధాన్యం దోపిడీ జరిగినట్లు తేలింది. ప్రస్తుతం ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320 ఉంది. అంటే ఈ పక్షం రోజుల్లో రైతుల వద్ద దోపిడీ చేసిన ఈ 1,081 టన్నుల ధాన్యం విలువ ఏకంగా రూ.2.36 కోట్లు ఉంటుందని అంచనా.

తరుగు ఇవ్వనంటే చుక్కలే..

ఒకవేళ ఎవరైనా రైతులు తరుగుపై ప్రశ్నిస్తే ఆ రైతుకు కేంద్రాల నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. నీ ధాన్యంలో తాలు అధికంగా ఉందని, తేమ శాతం ఎక్కువ ఉందని, ఇలా అనేక కొర్రీలు పెడుతున్నారు. ఒకవేళ తాలు ఉంటే హార్వెస్టర్ బ్లోయరే నిర్ణీత ఆర్పీఎం స్పీడుతో ఆ తాలును తీసేస్తుంది. పైగా ప్రస్తుతం ఎండలు 44 డిగ్రీలు దాటుతోంది. ఈ క్రమంలో ధాన్యంలో తేమ ఉండటం అసాధ్యం. తేమ 17 శాతం వరకు అనుమతి ఉంటుంది. తూకంలో కోత పేరుతో దోపిడీ యథేచ్ఛగా సాగుతుండటం గమనార్హం.

సర్కారు కేంద్రాల్లోనూ దందా..

ప్రైవేటు వ్యాపారులు చేసే కొనుగోళ్లలో తూకాల్లో కోతలు పెడుతుంటారు. కానీ సర్కారు కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే అక్రమ దందా సాగుతుంటే రైతులు తమ పంటను ఎక్కడ విక్రయించుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఏసీఎస్ కేంద్రాల్లో మరీ దారుణం..

జిల్లాలో ప్రస్తుతం మొత్తం 480 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ కొనసాగుతోంది. ఇందులో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు 92 కాగా, మిగిలిన 388 కేంద్రాలు పీఏసీఎస్‌లు. అయితే ఐకేపీ కేంద్రాలతో పోల్చితే.. ఈ పీఏసీఎస్‌లు నిర్వహిస్తున్న కేంద్రాల్లో రైతులపై నిలువు దోపిడీ మరింత ఎక్కువగా ఉంటోంది. ఆయా పీఏసీఎస్ పాలకవర్గాలు రాజకీయ నేతలే రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక్కో పాలకవర్గం నేత ఒక్కో సీజనుకు రూ.లక్షల్లో దండుకుంటున్నారనేది బహిరంగ రహస్యం. దీంతో రానున్న రోజుల్లోనైనా ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పీఏసీఎస్‌లకు తగ్గించి ఐకేపీలకు పెంచితే రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

42 కిలోలు కాంటా పెడుతుండ్రు



వడ్లల్లో పొల్లు ఉందని బస్తాకు 42 కిలోలు తూకం వేస్తున్నారు. ఇంత ఎందుకంటే మండలంలో అన్ని సెంటర్లలో ఇదేవిధంగా తూకం జరుగుతుందని, ఇక్కడ కూడా అలాగే తూకం వేస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు.
–లాల్ సింగ్, పీఏసీఎస్ చిన్నఘనాపూర్, రైతు

తూర్పార పట్టినా తరుగు తీస్తుండ్రు



ఈసారి మూడు ట్రాక్టర్ల వడ్లు చేతికొచ్చాయి. వడ్లు ఎగబోయకుంటే తగ్గి పోతుందని చెప్పారు. ఇంత ఎండ కొడుతున్నా కూడా వడ్లను పొల్లు లేకుండా ఎగబోసిన. అయినప్పటికీ బస్తాకు 42 కిలోలు తూకం వేస్తామంటున్నారు.
–లంబాడి సోనీ, వరిగుంతం, మహిళా రైతు

తరుగు తీస్తే చర్యలు



తరుగు తీయొద్దని చెప్పాం. తరుగు తీస్తే చర్యలు తీసుకుంటాం. ఇకపై కొనుగోలు కేంద్రాలను విజిట్ చేస్తాం. రైతులు కూడా వడ్లను తూర్పార బట్టి తెస్తే బాగుంటుంది.
–మెంచు నగేష్, అదనపు కలెక్టర్, రెవెన్యూ

క్లుప్తంగా

పుస్తెలతాడు అపహరణ


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): మహిళ మెడలో పుస్తెల తాడు అపరించుకెళ్లిన ఘటన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో మంగళవారం చోటు చేసుకుంది. చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన వనపర్తి భాగమ్మ ఆలయ పరిసరాల్లో కిరాణం, జనరల్ స్టోర్‌ను నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. రోజూ మాదిరిగా మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్వామి వారిని దర్శించుకొని వచ్చి షాప్‌ను ఓపెన్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మెడలోంచి ఐదు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

తొగుట(దుబ్బాక): దీపంతో ఇల్లుకు నిప్పంటుకొని కాలిబూడిదైన ఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నాయిని ఎల్లవ్వ ఉదయం ఇంట్లో దేవుడి చిత్రపటం వద్ద దీపం వెలిగించి బయటకు వెళ్లింది. ఈ ప్రమాదవశాత్తు దీపం కిందపడి బట్టలకు మంటలు అంటుకున్నాయి. పరిస్థితిని గమనించిన గ్రామస్తులు అప్రమత్తమై సిద్దిపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలార్పివేశారు. ఈ ఘటనలో రూ.3 వేలు నగదు, బట్టలు, బియ్యం, వంట సామగ్రితోపాటు కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు చేయించుకున్న దర్వాజలు, కిటికీలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య


మన్నె జ్యోతి(ఫైల్)

వర్గల్(గజ్వేల్): కడుపునొప్పి భరించలేక తాళలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వర్గల్ మండలం అంబర్‌పేటలో చోటు చేసుకుంది. గౌరారం పోలీసుల కథనం మేరకు.. అంబర్‌పేటకు చెందిన మన్నె శ్రీనివాస్, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురికి ఏడాదిన్నర కిందట వివాహం కాగా చిన్న కూతురు జ్యోతి(17) మెదక్ జిల్లా కూచారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఇటీవలె ఫస్టియర్‌లో 439 మార్కులు సాధించింది. సెలవులు కావడంతో ఇంటివద్దే ఉంటుంది. కొంత కాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న జ్యోతి మంగళవారం సాయంత్రం నొప్పి తాళలేక గ్రామ సమీప తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మందలించాడని యువకుడు

మద్దూరు(హుస్నాబాద్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బచ్చల చంద్రకాంత్(24) కొద్ది రోజులుగా ఏ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఏ పని చేయడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బలరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్(20) మంగళవారం మధ్యాహ్నం ఇంటి పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా మర్కూక్ పాఠశాల ఉపాధ్యాయులు


చిన్న బ్రహ్మయ్య


ఓంకార్ రాధాకృష్ణ

మర్కూక్(గజ్వేల్): రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా మర్కూక్ పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మండలంలోని దారకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య, ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ గురువారం ఎంపికయ్యారని మండల విద్యాధికారి వెకట్‌రాములు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో 641 మంది దరఖాస్తు చేసుకోగా 27న రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ వారు హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. 152 మంది ఎంపికయ్యారని మర్కూక్ మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలల ఉపాధ్యాయుల వారికి అభినందనలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు





కోతలు మొదలు.. ధాన్యం బారులు

సంగారెడ్డి జిల్లాలో ఇటీవలె ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. వరి కోతలు ప్రారంభం కావడంతో సంగారెడ్డి, కంది పరిసర ప్రాంతాల్లోని రైతులు ఇప్పుడిప్పుడే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. దానితో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలతో ట్రాక్టర్లు బారులు తీరాయి .

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

కలెక్టరేట్ ఆవరణలో నిరుపయోగంగా 104 వాహనాలు





అధికారుల నిర్లక్ష్యం.. సంచారం లేని వాహనం

సీజనల్ వ్యాధుల కాలంలో మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వారధిలా ఉన్న 104 సంచార వాహనాలు మూలనపడ్డాయి. కలెక్టరేట్‌లోని ఐదు వాహనాలు నిరుపయోగంగా మారాయి. చిన్నపాటి మరమ్మతులు చేసే వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తుప్పు పట్టి పనికి రాకుండాపోతున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

కనిపించని కల్లాలు..

రోడ్లపైనే వడ్లు

రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్న రైతులు

- కల్లాల కొరతతో నానా అవస్థలు
- వాహదారులకు తప్పని ఇబ్బందులు
- నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం
- పట్టించుకోని అధికారులు


అల్లీపూర్ వద్ద రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై పోసిన పంట కుప్పలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంటను ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు తారు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. చేతికొచ్చిన పంట దిగుబడుల్లో తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్నారు. ధాన్యం కుప్పలు రోజుల తరబడి ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.

వాహనదారులకు ముప్పు..

యేటా సీజన్ రాగానే రైతులు రోడ్లపై ఇరువైపులా పంట కుప్పలు పోయడంతో రహదారులు కల్లాలుగా మారాయి. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి పూట వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. నిత్యం పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కానీ కల్లాలు లేకనే రోడ్లపై పంటను ఆరబెట్టాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.


రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

కలగానే కల్లాలు..

గతంలో ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై కల్లాల నిర్మాణానికి దరఖాస్తులను స్వీకరించింది. కొన్ని గ్రామాల్లో పూర్తయినా బిల్లులు రాలేదని, కొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయని రైతులు వాపోతున్నారు. గత మూడేళ్లుగా కల్లాల పథకం నిలిచిపోవడంతో అర్హులైన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు రైతుల కష్టాలు గుర్తించి పథకాన్ని పునరుద్ధరిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు



దుబ్బాక : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు రోడ్లపై పోయకుండా కల్లాల్లో ఆరబెట్టుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యాన్ని రోడ్లపై పోయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికే రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలను వాహనాలు ఢీ కొట్టి మృతి చెందిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రైతులు ప్రమాదాలకు కారణం కావొద్దన్నారు. ఇప్పటికే రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దంటూ రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనికి రైతులు సహకరించాలని సీఐ కోరారు.

-సీఐ శ్రీనివాస్

అరుదైన ‘వీరగల్లు’ శిల్పాలు

- సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో వెలుగులోకి
- పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు శ్రీనివాస్




పులివేట వీరగల్లుల శిల్పాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలోని గౌరయపల్లి గ్రామంలో పులివేట వీరగల్లుల రాతి శిల్పాలు ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వాటిని పరిశీలించి 17 శతాబ్దానికి చెందినవిగా పేర్కొన్నారు. కన్నడ భాషలో హులిబేటె అని పిలిచే ఈ పులివేట వీరగల్లుల శిలా రూపాలు తెలంగాణలో మూటకోడూర్, నిజామాబాద్, గోనేపల్లి, అమ్మనబోలు వంటి ప్రదేశాల్లో గతంలో లభించాయని పేర్కొన్నారు. గ్రామం మీద పెద్ద పులిదాడి చేసిన సమయంలో వీరుడు వాటితో పోరాడి ప్రజల్ని కాపాడి మరణం పొందిన సందర్భంగా వేసిన వీరశిలలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ మూడు రాతి శిల్పాల్లో రెండు పులితో వేటాడుతున్నవి, మూడవది శైవ భక్తుడు తన సిగముడిని వంచిన వెదురుగడకోసకు కట్టుకొని అంజలిపట్టి యోగాసనం కుర్చున్నట్లు తెలిపారు. వీటి శిల్పశైలిని బట్టి రాష్ట్ర కుటుల కాలం నాటి శిల్పాలుగా పేర్కొన్నారు. ఆయన వెంట కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన హరగోపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ‘రుతు ప్రేమ’

డీపీఓ దేవకీదేవి


మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

కోహెదరూరల్(హుస్నాబాద్): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రుతు ప్రేమ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీపీఓ దేవకీదేవి అన్నారు. మండలంలోని సముద్రాల గ్రామంలో రుతుప్రేమ కార్యక్రమంలో భాగంగా మెన్‌స్టువల్ కప్, క్లాత్‌ప్యాడ్‌ల వినియోగంపై మహిళకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ మనుగడను శాసించేది రుతుచక్రమని రుతు చక్రం లేకపోతే జీవనమే లేదని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్ వల్ల మహిళల ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి కూడా ప్రమాదమేనని అన్నారు. క్లాత్ ప్యాడ్స్ మెన్ స్టువల్ కప్ ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. మెన్‌స్టువల్ కప్ 8 నుంచి 10 ఏళ్ల వరకు వాడొచ్చని ఇవి సురక్షితమైనవని, ఆరోగ్యకరమైనవని అన్నారు. నెలనెలా ప్యాడ్స్ కొనాల్సిన అవసరం లేదని, అలా ప్రతీ మహిళకు ఏటా రూ.1,200 వరకు ఆదా అవుతుందన్నారు. అనంతరం మహిళలు, యువతులకు ఉచితంగా మెన్ స్టువస్ కప్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెట్విన్ కో ఆర్డినేటర్ అమీనా, ఇన్‌చార్జి ఎంపీఓ శోభ, పంచాయతీ కార్యదర్శులు నిహారిక, నజియా, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రం దహనం


కాలిపోయిన వరి కోత యంత్రం

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తులు వరి కోత యంత్రంకు నిప్పంటించి దహనం చేశారు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లగిశెట్టి వెంకటేశం, ఎస్టీ జహీర్ కలిసి కొన్నేళ్ల కిందట అప్పులు చేసి వరి కోత యంత్రంను కొనుగోలు చేశారు. సోమవారం రాత్రి వరకు మద్దూరి నారాయణరెడ్డి వరి పంటను కోసి సమీపంలో మరి కొందరి రైతుల పంటను కోసేది ఉండటంతో యంత్రంను నారాయణరెడ్డి బావి వద్దే ఉంచారు. మరుసటి రోజు వెళ్లే సరికి యంత్రం పూర్తిగా కాలిపోయి ఉంది. వ్యవసాయ బావి యజమానికి, గ్రామస్తులకు సమాచారం అందించారు. వరి కోత యంత్రంను దహనం చేసేందుకు డిజిల్ ట్యాంకరుపై ఎండు గడ్డిని వేసి నిప్పంటించగా డిజిల్ ట్యాంక్ పేలి కాలిపోయినట్లుగా నిర్ధారించారు. సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంపై వెబినార్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం తెలుగు సాహిత్య అధ్యయనం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు తెలుగుపై పట్టు సాధిస్తే అనేక అవకాశాలున్నాయన్నారు. ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా సివిల్ సర్వీసెస్‌లో విజయాలు సాధించవచ్చన్నారు. డీటీపీ టైపింగ్, తెలుగు కరపత్రాలు, గూగుల్, వీకీపీడియాలో రచయితలుగా, తెలుగు అనువాదకులుగా ప్రూఫ్ రీడర్లుగా, పత్రికా సంపాదకులుగా, పరిశోధకులుగా రాణించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. కృత్రిమ మేధస్సును తెలుగులో ఉపయోగించుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త పిట్లదాస్, ఎస్ఆర్ఆర్ కరీంనగర్ కళాశాల తెలుగు విభాగాధ్యక్షులు డా.బూర్ల చంద్రశేఖర్, గజ్వేల్ కళాశాల తెలుగు విభాగాధ్యక్షులు డా. ఆర్ మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు నారోజు వెంకటరమణ, చక్రహరిరమణ, బానోజు సంపత్‌తోపాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు మండలంలో చేపట్టిన రూ.6.78 కోట్ల కూలి పనులు, రూ.3 కోట్ల 78 లక్షలకు సంబంధించి మెటీరియల్ పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి సిబ్బంది చదివి వినిపించారు. గోమారంలో ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శులు అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్ ఆరోపిస్తూ ఆందోళన చేశారు. గ్రామంలో చేపట్టిన పనులపై సమగ్ర విచారణ చేస్తామని జిల్లా అదనపు పీడీ రంగాచార్యులు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అవినీతికి పాల్పడిన పలువురు సిబ్బంది నుంచి రూ. 2.90 లక్షలు రికవరీ చేస్తామని అదనపు పీడీ, విజిలెన్స్ అధికారి శ్రీహరి పేర్కొన్నారు. అలాగే రూ.32 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సంపత్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, సీనియర్ క్వాలిటీ అధికారులు జ్యోతి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్ ఉన్నారు. పలు గ్రామాల్లో కూడా అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.

నలుగురు అదృశ్యం

పరీక్ష రాసేందుకు వచ్చి విద్యార్థిని

గజ్వేల్‌రూరల్: పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన దుర్గని అంకిత గజ్వేల్ పట్టణంలో బాలుర హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు నానమ్మ లక్ష్మీతో కలిసి వచ్చింది. పరీక్షా కేంద్రం వద్ద నీళ్ల బాటిల్ తీసుకొస్తానని చెప్పి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సూరంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జీవన్‌పై అనుమానమున్నట్లు లక్ష్మీ గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంధువుల వద్దకు వెళ్లిన మహిళ

వెల్దుర్తి(తూప్రాన్) : ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని శేరీల గ్రామానికి చెందిన చల్ల కొమురమ్మ సుమారు నెలన్నర రోజుల కిందట చిన్నశంకరంపేట మండలం బాగిర్తిపల్లిలో బంధువుల పెళ్లికి వెళ్లింది. వివాహానికి హాజరైన అనంతరం కొద్ది రోజులు ఇతర బంధువుల వద్దకు వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం కొమురమ్మ కూతురు అలవేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సామగ్రి కొనుగోలుకు వెళ్లి

నారాయణఖేడ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. నాగల్‌గిద్ద ఎస్ఐ బీ.సాయిలు కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెనుగు అంజన్న (42) 28న కిరాణా సామగ్రి కొనుగోలు నిమిత్తం నారాయణఖేడ్‌కు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. అంజన్న భార్య సావిత్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జహీరాబాద్ టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం మేరకు.. బాగారెడ్డిపల్లికి చెందిన డీ.కేశప్ప రెండో కూతురు డీ.అశ్విని(20) పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో గల టైలర్ దుకాణంలో పని చేస్తుంది. ప్రతి రోజూ ఉదయం టైలరింగ్ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికొస్తుంది. 25న పనికి వెళ్లిన అశ్విని ఇంటికి రాకపోవడంతో బంధువల వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి కుశప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పింఛన్ కోసం వృద్ధుల పాట్లు


పోస్ట్ ఆఫీసు ఆవరణలో చెట్టు కింద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

నర్సాపూర్ : పింఛన్ కోసం వృద్ధులు నానా పాట్లు పడుతున్నారు. నర్సాపూర్‌కు చెందిన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు స్థానిక పోస్ట్ ఆఫీసు ద్వారా ప్రతి నెల పింఛన్లను పంపిణీ చేస్తారు. కాగా పోస్ట్ ఆఫీసు వద్ద నీడ, కూర్చునేందుకు బెంచీలు లాంటి వసతులు లేకపోవడంతో ఎండలోనే నిలబడ్డారు. అరుగులపై , చెట్టు కింద కూర్చొని నిరీక్షించారు. అధికారులు కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం మార్చి నెల పింఛన్ ఇస్తున్నారని తెలిసి వచ్చామని వృద్ధులు చెప్పారు. ఈ విషయమై స్థానిక పోస్ట్ మాస్టర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా సోమవారం సాయంత్రం ఫండ్ వచ్చిందని, ఈరోజే పంపిణీ ప్రారంభించామని పేర్కొన్నారు.

ప్రత్యేక శిబిరం.. ప్రధానోపాధ్యాయుడి ఔదార్యం

అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహణ

- గణితం, ఇంగ్లిష్, తెలుగు చేతి రాతతో పాటు సంస్కృతి సంప్రదాయాలపై శిక్షణ
- హెచ్ఎం లక్ష్మీనారాయణను అభినందిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధతో వేసవి శిబిరం నిర్వహిస్తున్నాడు. 24 నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో తన పాఠశాలలో చదువుకుంటున్న పేద మధ్య తరగతి పిల్లలను ప్రైవేటు పాఠశాలలు దీటుగా చదివించాలన్న లక్ష్యంతో తానే చొరవ తీసుకొని ఈ శిబిరాన్ని ప్రారంభించాడు.

సుమారు 40 మంది విద్యార్థులు ఈ శిబిరానికి హాజరవుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొనసాగుతుంది. శిబిరంలో గణితం, ఇంగ్లిష్, తెలుగు, చేతి రాతతో పాటు సంస్కృతీ సాంప్రదాయాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. వేసవి నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు రావడంతో ఇతర ఉపాధ్యాయులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ మాత్రం ఎక్కడికి వెళ్లకుండా శిబిరం కొనసాగిస్తున్నాడు. విద్యార్థులు సైతం శ్రద్ధతో శిబిరానికి వచ్చి శిక్షణ పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


శిక్షణ పొందుతున్న అచ్చంపేట విద్యార్థులు

సేవలు అభినందనీయం: ఎంఈఓ తారా సింగ్

అచ్చంపేట పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం. విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాడు. శిక్షణ శిబిరాన్ని పలుమార్లు సందర్శించాను. ఇతర ఉపాధ్యాయులు సైతం ఇలాంటి కార్యక్రమాలు చేపడితే ప్రైవేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులను తీర్చి దిద్దేందుకు అవకాశం ఉంటుంది.

ప్రైవేటుకు దీటుగా విద్య : లక్ష్మీనారాయణ

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన కల్పించాలన్న లక్ష్యంతోనే అచ్చంపేట పాఠశాలలో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించాను. అచ్చంపేట గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ఉండేందుకు గణితం, ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతి సాంప్రదాయాల శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ శిబిరంలో వెలికి తీసి వారిని ప్రయోజకులను చేసేందుకు కృషి చేస్తున్నా. ఆట, పాటలు, డ్రాయింగ్, ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్, జనరల్ నాలెడ్జ్ లో సైతం శిక్షణ ఇస్తున్నాం.


చేతి రాత శిక్షణ ఇస్తున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ